క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామంలో లబ్ధిదారులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కన్నెబోయిన గోపి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన అవుల మహాలక్ష్మమ్మ , దోమకొండ లక్ష్మీ లకు.. వైద్య ఖర్చుల నిమిత్తం భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.35వేల చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపి, సయ్యద్ షాజహాన్, పాండురంగారావు, నాగరాజు, రాము పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సత్తుపల్లిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకులు, కార్పొరేట్ శక్తులపై పోరాటాలే శరణ్యమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో జరిగిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. పోరాటాల వల్లే పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సమావేశంలో రమణ, చెన్నారావు, మారేష్, విజయమ్మ, లక్ష్మణ్, మారేశ్వరరావు, కామేశ్వరరావు, సనందరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన మధుకు సన్మానం

తల్లాడ: మండలంలోని నూతనకల్‌కు చెందిన రైతు సంఘం మండల అధ్యక్షుడు కల్యాణపు కృష్ణయ్య కుమారుడు మధు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో న్యాయవాద కోర్సు (ఎల్‌ఎల్‌ఎం)లో డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించాడు. దీంతో ఈనెల 9న గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. దీంతో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మధుకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, వీరభద్రరావు, రాజారావు, ఎస్.మోహన్‌రావు, కృష్ణయ్య, పకీరమ్మ, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన మోదుగు జమలయ్య కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న మోదుగు శశిధర ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆ గృహాన్ని సందర్శించి శశిధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు లక్కినేని రఘు, రామకృష్ణ, కృష్ణ, కిరణ్, రజనీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

పెరిగిన పత్తిసాగు



ఏన్కూరులో సాగు చేసిన పత్తి

- 15,500 ఎకరాల్లో విత్తనాలు
- ఏడాదికి రెండు పంటల సాగు
- తగ్గిన మిర్చిపంట

ఏన్కూరు: పత్తి తక్కువ పెట్టుబడులు కావడంతో మార్కెట్‌లో పత్తికి క్వింటా రూ.7,500 ధర పలకడంతో రైతులు పత్తిసాగుపై దృష్టి సారించారు. ఈ ఏడాది మండలంలో పత్తిసాగు 15,500 ఎకరాల్లో సాగు చేపట్టారు. పత్తి రెండుసార్లు తీసిన తరువాత డిసెంబర్‌లో మొక్కజొన్న సాగు చేస్తు ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తున్నారు. దీంతో నీటి వసతి ఉన్న రైతులందరు ఏడాది పత్తి, మొక్కజొన్న రెండు పంటలు ద్వారా ఆదాయం పొందుతున్నారు.

మిర్చిపై తగ్గిన ఆసక్తి..

గత కొన్ని సంవత్సరాలుగా మిర్చిసాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు మిర్చికి గిట్టుబాటు ధర రాకపోవడం, వైరస్ సోకడంతో ఈ సాగుపై దృష్టి కనబరుచట లేదు. గత ఏడాది 3,781 ఎకరాల్లో మిర్చిసాగు చేసిన రైతులు ఈ ఏడాది 2,500 ఎకరాల్లో సాగు చేసేది నమ్మకం లేదు. దీంతో పాటు మిర్చిసాగుకు ఎకరానికి రూ. 1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు పెట్టుబడులు అవుతాయి. లక్షలు ఖర్చుపెట్టి సాగు చేస్తే వైరస్ సోకడం దిగుబడులు తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఈ సాగును వదిలిపెట్టి పత్తిసాగుపై మక్కువ చూపుతున్నారు.

పత్తిపంట దిగుబడి వివరాలిలా..

గత ఏడాది మండలంలో 13వేల ఎకరాల్లో పత్తి సాగుచేసిన రైతులు ఈ ఏడాది అధిక మొత్తంలో పత్తిసాగు చేస్తున్నారు. పత్తి దిగుబడులు అమ్మెందుకు జిన్నింగ్‌మిల్లులు అందుబాటులో ఉండడం, సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయడంతో రైతులు ఈ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. పత్తి ఎకరానికి సుమారు రూ.40 వేలు పెట్టుబడి పెడితే.. ఎకరానికి 14 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి.

ఏడాదికి రెండు పంటలు..

రెండుసార్లు పత్తి తీసిన తరువాత రైతులు డిసెంబర్‌లో పత్తి తీసివేసి మొక్కజొన్న వేస్తారు. మొక్కజొన్న ఎకరానికి రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. మొక్కజొన్న ఎకరానికి 28 క్వింటాళ్ల నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. మొక్కజొన్న మార్కెట్‌లో క్వింటా రూ.2వేల వరకు ధర పలుకుతుంది. దీంతో రైతులు తక్కువ పెట్టుబడులతో ఏడాది రెండు పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. కొంత మంది రైతులు కంపెని వారి వద్ద నుండి విత్తనాలు, మందులు, పెట్టుబడులు తీసుకొని ఆడ,మగ మొక్కజొన్న సాగు చేస్తున్నారు. నీటి వసతి లేని రైతులు పత్తి తీసిన తరువాత అపారాల సాగు కూడా చేయవచ్చని వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు.

రెండుపంటలు సాగు చేస్తాను..



పత్తి రెండు ఎకరాల్లో సాగు చేశాను. ఎకరానికి సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. పత్తి రెండు సార్లు తీసిన తరువాత మొక్కజొన్న సాగు చేస్తాను. దీని వలన ఒక పంటలో నష్టం వచ్చినా ఇంకొక పంటలో లాభం వస్తుంది. దీంతో పాటు పంటమార్పిడి విధానం చేయడం వలన దిగుబడులు ఎక్కువగా వస్తాయి.

– భట్టు హనుమంతు రెడ్డి, రైతు, ఆరికాయలపాడు

అపరాలసాగు చేయొచ్చు..



ఈ ఏడాది రైతులు అధిక మొత్తంలో పత్తిసాగు చేశారు. రెండుసార్లు పత్తి తీసిన తరువాత మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గత ఏడాది మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడం, వైరస్ సోకడంతో అప్పులు పాలయిన రైతులు తక్కువ పెట్టుబడులతో రెండు పంటలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి వసతి లేని రైతులు అపారాలసాగు చేయాలి.

– ఆర్ బాలకృష్ణ, ఏఈఓ, తిమ్మారావుపేట

మానవ సేవే – మాధవ సేవ



కొండయ్యకు దుస్తులు అందజేస్తున్న మణిందర్ రెడ్డి

మధిర: మానవసేవే మాధవసేవ అని, సేవా కార్యక్రమాలను అనేక రకాలుగా చేపట్టవచ్చునని ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య తెలిపారు. మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్డులో లంకా కొండయ్య నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఉచిత పాత దుస్తుల సేకరణ కేంద్రానికి పలువురు దాతలు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల ఉంచి సేకరించిన దుస్తులను యాచకులకు, వలస కూలీలకు, ప్రమాద బాధితులకు, వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందిస్తున్నామని, ఇప్పటికే సుమారు 3వేల కుటుంబాలకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పాత దుస్తులు అందజేసినవారిలో మాటూరుపేట గ్రామానికి చెందిన కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తనయుడు మణిందర్ రెడ్డి, బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శీలం నరేందర్ రెడ్డి, మధిరవాసులు గొండేల నాగేశ్వరరావు, కొమ్మినేని రఘుబాబు, యరగొర్ల సురేష్, రాము, శ్యామ్ తదితరులు ఉన్నారు.

సీతారామ-పాలేరు అనుసంధానం పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న రాంబాబు

బోనకల్: సీతారామ – పాలేరు అనుసంధానం పనులు ప్రారంభించి, నాగార్జునసాగర్ ఎడమకాల్వ యూటీ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని జానికీపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది వచ్చిన భారీ వరదలకు కూలిపోయిన కాలువకు, తాత్కాలిక పనులు చేపట్టి ఆయకట్టుకు నీరందించాలని, మంత్రులు బాధ్యత వహించాలన్నారు. బోనకల్ మండల రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, కావున పామాయిల్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు కోటేశ్వరావు, సురేష్, హనుమంతరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల సందడి



వైరా: బోనంతో వెళ్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్

వైరా: గ్రామాల్లో బోనాల సందడి మొదలైంది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకానగర్‌లో శ్రీకృష్ణ పాల పోచమ్మ తల్లికి.. మహిళలు బోనాలతో తరలి వెళ్లి అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై బోనమెత్తుకుని దేవాలయానికి వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతిలో ముఖ్యమైన వేడుక అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, పుల్లయ్య, ప్రతిభారెడ్డి, గంగారావు, అశోక్, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, శబరీనాద్, గంగరాజు, రామారావు, సీతారాములు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమ్మతల్లికి..



కారేపల్లి క్రాస్‌రోడ్డులో..

కారేపల్లి: మండలంలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో మహిళలు బోనాలతో ఎర్రమ్మ తల్లి దేవాలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మైసమ్మతల్లికి..



చింతకాని: నేరడ గ్రామంలో..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో గురుజు మైసమ్మతల్లి ఆలయానికి మహిళలు బోనాలతో డప్పువాయిద్యాల నడుమ ప్రదర్శనగా వెళ్లి బోనాలు సమర్పించారు. పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ గోపాలరావు, గ్రామపెద్దలు రవి, దస్తగిరి, నాగేష్, నరేష్ పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి..



తల్లాడ: నరసింహారావుపేటలో..

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట గ్రామంలో మహిళలు ఇంటి వద్దనే అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలు, పాయసం పొంగళ్లు తయారు చేసుకొని గ్రామ సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్ వద్ద ఉన్న మొక్క పోచమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. ఆలయం వద్ద పోచమ్మ తల్లికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

కోటమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయపల్లి శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా.. అమ్మవారు ఆదివారం శాకాంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొని శ్రీకోటమైసమ్మతల్లిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాషశర్మ పూర్ణకుంభంతో ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఆలయ సిబ్బంది మోహన్‌కృష్ణ, లలిత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



భాగ్యనగర్‌తండాలో పార్టీలో చేరిన వారితో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండాకు చెందిన 45 బీఆర్‌ఎస్ కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు మంజుల, చంద్రప్రకాశ్, టోనీ ప్రతాప్, తిరుపతిరావు, రామ్మూర్తి నాయక్, భీముడు నాయక్, హీరాలాల్, రాందాస్ నాయక్, భగవాన్ దాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

ఏన్కూరు: స్నేహితుడికి ఆర్థిక సాయం చేసి తోటి మిత్రులు తమ సహృదయాన్ని చాటుకున్నారు. జూలూరుపాడు మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బానోత్ నెహ్రూకు యాక్సిడెంట్ అయిన విషయాన్ని తెలుసుకున్న 1991–92 సంవత్సరం 10వ బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు వైద్యఖర్చులకు రూ.30 వేలను నెహ్రూ కుటుంబానికి అందించారు. మిత్రులు రామృకష్ణ, రమాదేవి, రజని, మోహన్‌రావు, భీమా, శివాజీ, సీతయ్య, శ్రీను పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



పెద్దకోరుకొండి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న గురువులు

కల్లూరురూరల్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండిలో గల ఆర్‌సీఎం చర్చి పునీత జోజప్ప దేవాలయ విచారణ పరిధిలోని ఎర్రబోయినపల్లి, చెన్నూరు, తాళ్లూరు వెంకటాపురం, చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి చర్చిల్లో ఆదివారం నుంచి క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు దీవెనలు మెండుగా ఉండాలని వర్షాలు కురవాలని మత గురువులు వినయ్‌కుమార్‌రెడ్డి, ఆందోని ప్రార్థనలు నిర్వహించారు. వివిధ చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్టర్ ఇంటి నిర్మాణానికి అంగీకారమే



మాట్లాడుతున్న క్రీస్తు సంఘం సభ్యులు

సత్తుపల్లిటౌన్: చర్చి స్థలంలో పాస్టర్ ఇంటి నిర్మాణానికి సంఘ సభ్యులందరికీ అంగీకారమేనని దీనికి ఎవరి అభ్యంతరం లేదని సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం సభ్యులు స్పష్టం చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 35 సంవత్సరాలుగా క్రీస్తు సంఘాన్ని నడిపిస్తున్న పాస్టర్ అలవాల కరుణాకర్‌పై కొందరు చేస్తున్న అసభ్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పాస్టర్ అలువాల కరుణాకర్, సంఘ సభ్యులు ఎం.అనీల్ కుమార్, కొత్తపల్లి ప్రభాకర్, జె.కుమార్‌రాజా, కె.వెంకటేశ్వరరావు, నవకుమార్, నాగయ్య, కుమార్, సంతోషమ్మ, రోజిని, మణికుమారి, నాగార్జున, శిరీష పాల్గొన్నారు.

భట్టి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన డీఆర్డీఓ..

చింతకాని: భట్టివిక్రమార్క పర్యటన ఏర్పాట్లను డీఆర్డీఓ సన్యాసయ్య ఆదివారం పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలతో పాటు భట్టి విక్రమార్క చింతకాని మండలానికి చెందిన 960 మహిళా సంఘాలకు రూ. 1.22 కోట్లు వడ్డీ లేని రుణాల చెక్కులను, 523మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

భట్టి పర్యటనను విజయవంతం చేయాలి

చింతకాని: చింతకాని మండలంలో సోమవారం నిర్వహించనున్న భట్టి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చింతకానిలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించటం జరుగుతుందని, అలాగే మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను భట్టివిక్రమార్క పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, గోపి, కిషోర్, గోవిందరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను..



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

మధిర: ఈ నెల 19,20 తేదీల్లో మధిర రెడ్డి గార్డెన్స్ కల్యాణమండపంలో జరిగే సీపీఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం మధిర పట్టణంలోని బెజవాడ రవిబాబు నివాసంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ పోరాటాల తీర్మానాలకు మహాసభ వేదిక అవుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, మండల కార్యదర్శి కొండలరావు, వెంకటేశ్వరరావు, రహీం, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య మహాసభను..

చింతకాని: ఈ నెల 15న చింతకానిలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య మండల మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, కార్యదర్శి ఏపూరి లతాదేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాట నిర్మల, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీపీఐ సత్తుపల్లి మండల కార్యదర్శిగా యోబు



తడికమళ్ల యోబు

సత్తుపల్లిరూరల్: సీపీఐ సత్తుపల్లి మండల కార్యదర్శిగా తడికమళ్ల యోబును ఏన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ తెలిపారు. సీపీఐ సత్తుపల్లి మండల మహాసభ గంగారంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. 15 మంది కౌన్సిల్ సభ్యులతో 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, ఏపూరి లతాదేవి, తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామిల్స్ అసోసియేషన్‌లో మధిరకు ప్రాధాన్యత



సామిల్స్ అసోసియేషన్ కమిటీకి ఎన్నికైన మునుగోటి, నజీర్

మధిర: ఖమ్మం జిల్లా సామిల్స్, టింబర్ డిపో అసోసియేషన్ నూతన కమిటీలో మధిరకు ప్రాధాన్యత దక్కింది. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖాజీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షేక్ నజీర్‌ను, కార్యవర్గ సభ్యుడిగా మధిర మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఖమ్మంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన ఖమ్మం జిల్లా అండ్ టింబర్ డిపో యజమానుల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

తుమ్మల పరామర్శ

వేంసూరు: మండలంలోని వెంకటపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురి కాగా.. ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టారాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్.. సోమిరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఏఎంసీ చైర్మన్ దోమానంద్‌బాబు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎండీ ఫైజుద్దీన్, బొమ్మర బోయిన వెంకటేశ్వరరావు, జంగా శ్రీనివాసరెడ్డి, పక్రుద్దీన్ నాయకులు పాల్గొన్నారు.

బిల్లుపాడులో హోంగార్డ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో బిల్లుపాడు గ్రామానికి చెందిన హోంగార్డ్ రఘుపతి మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెకటవీరయ్య పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కేతినేని చలపతిరావు, ఇంజం కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక మాజీ సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటిని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు కర్నాటి సుధాకర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏటా తప్పని తిప్పలు..



కమలాపురంలో రోడ్డుపై పారుతున్న నీరు(ఫైల్)



ఇళ్లల్లోకి చేరిన వరద(ఫైల్)

- ప్రభుత్వాలు మారినా.. పరిస్థితి మారడం లేదు
- అటకెక్కిన ప్రణాళికలు, పట్టించుకోని అధికారులు

ముదిగొండ: ప్రతి పల్లె పారిశుద్ధ్యంతో కళ కళలాడితేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుంది. ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం. దీనికి విరుద్ధంగా ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో అనేక మంది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో భారీగా వచ్చే వరదలకు వాగులు వంకలు పొర్లడమే కాకుండా, ఇళ్లల్లోకి చేరుతున్నాయి. పక్కా ప్రణాళికలు లేక వరదలు రోడ్లపై పారుతున్నాయి. ఇటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల సమన్వయ లోపంతో ప్రజలకు శాపంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా, వారి తల రాతలు మారడం లేదు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

మండలంలోని వివరాలిలా..

ముదిగొండ మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో మొత్తం 33గ్రామాలున్నాయి. జనాభా 60వేల మంది ఉన్నారు. ప్రతి పల్లెకు ప్రత్యేక అధికారి తోపాటు, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులున్నారు. ప్రత్యేకాధికారులున్నా, పల్లెల్లో ఏమాత్రం సమస్యలు పరిష్కారం కావడం లేదు. సైడ్ డ్రైయిన్లలో శిల్టు, చెత్తా చెదారం నిండుకుని ఉండడమే కాకుండా, వర్షాకాలంలో వరదలకు ఇళ్లల్లోకి నీరు చేరి పలుమార్లు ఇబ్బందులు పడుతున్నా, సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గతేడాది భారీ వర్షాలకు..

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలకు ఇళ్లు, రోడ్లు, వరి పొలాలు సైతం కొట్టుకుపోయాయి. ఆ క్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు. వంద్రేగుపల్లి, వనంవారికిష్టాపురం డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లోకి నీరు చేరినప్పుడల్లా అధికారులు, పాలకులు కాస్త హడావిడిని ప్రదర్శించి ఉనికిని చాటుకుంటారు. అటు తరువాత మోహం చాటేస్తారు. ఇకనైనా ప్రత్యేక అధికారులు, పాలకులు చొరవ తీసుకుని సైడ్ డ్రైయిన్లు, మరమ్మతులు చేయించాలని ముదిగొండ మండల ప్రజలు కోరుతున్నారు.

వారం రోజులు బయటనే ఉన్నా..



నేను కమలాపురంలోని మా చెల్లివాళ్ల రేకుల ఇంటిలోని ఒక గదిలో ఉంటున్నా. పోయిన ఏడాది వర్షాలకు వరదలు పోటెత్తడంతో ఇంట్లోని సామాన్లు కొట్టుకుపోయాయి. దీంతో వారంరోజుల పాటు ఆరుబయటనే వంట చేసుకుని మరీ ఉన్నా. కనీసం నాకు ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయలేదు.

– గుండు చిలకమ్మ, కమలాపురం

సమస్య లేకుండా చేస్తాం..



గ్రామాల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనుల చేపడుతున్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట సైడ్ డ్రైయిన్లు నిర్మాణాలు చేపడతారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లోకి వర్షాకాలంలో నీరు చేరితే తెలియజేయాలని చెప్పాం. సమస్య లేకుండా చూస్తాం.

– వాల్మీకి కిషోర్, ఎంపీఓ, ముదిగొండ

వానాకాలం వస్తే వణుకే..!

వేంసూరు: వానాకాలం వచ్చిందటే చాలు కందుకూరు ఎస్సీకాలనీ వాసులకు అవస్థలు తప్పడం లేదు. గత మూడేళ్లుగా జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలకు ఇళ్లలోకి వర్షం నీరుచేరడంతో అధికారుల వచ్చే పునరావాస కేంద్రాలకు తరలించడం, తాత్కలికంగా సమస్యను పరిష్కరించడం తప్ప శాశ్వత పరిష్కరం చూపడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా డ్రైయినేజీలు..

కందుకూరు ఎస్సీ కాలనీలో డ్రైయినేజీలు అధ్వానంగా ఉండటంతో మురుగు నీరు ముందుకు కదలక ఇళ్ల ముందే నిలవడంతో పాటు.. ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా ఎర్రగుంటపాడు పంచాయతీ యానాధుల కాలనీ వాసులది ఇదే స్థితి,కాలనీ ప్రక్కన ఉన్న చెరువు నిండటంతో ప్రతి ఏడాది ఇళ్లలోకి నీరు చేరుతుంది. ఇకనైనా అధికారులు కల్పించుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కందుకూరు ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగు నీరు

ఏటా ఇబ్బందులు పడుతున్నాం..



ప్రతి ఏటా వానాకాలంలో ఇళ్లలోకి నీరు చేరుతుంది. మురుగు నీరు సైతం నిల్వ ఉండటంతో సీజనల్ వ్యాధుల భారిన పడుతున్నారు. ఈ ఏడాదైన ముందస్తుగా పనులు చేస్తే కాలనీ వాసులకు మేలు జరుగుతుంది. అధికారులు చొరవ చూపాలి.

– సాధు రామకృష్ణ, కందుకూరు ఎస్సీ కాలనీ